క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జీ.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, కాజీపేటలోని విష్ణుపురి, రహమత్‌నగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి చేయూత



హసన్‌పర్తి: హిమాచల్‌ప్రదేశ్‌లో ఐఐటీలో ప్రవేశం పొందిన 66వ డివిజన్‌కు చెందిన సందెల శ్రావ్యకు చదువు నిమిత్తం స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆర్థిక చేయూతనిచ్చారు. శ్రావ్య తండ్రి భిక్షపతి.. బల్దియాలో 66వ డివిజన్‌లో శానిటరీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

కేడీసీ లైబ్రేరియన్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ పల్లెర్ల శంకరయ్యకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. సోసియో ఎకనామిక్స్ కండిషన్స్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శంకరయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. భారత ప్రభుత్వ ఐసీఎస్ఎస్ఆర్ అనుబంధ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మురళీప్రసాద్ పర్యవేక్షణలో శంకరయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రైతుబీమాకు దరఖాస్తులు

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు బీమా పథకంలో ఈనెల 5వ తేదీ సాయంత్రంలోపు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కాజీపేట మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 2023, 18 జూన్‌లోపు నూతన పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు పేర్లు నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. 18 -59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా రమేష్



కాజీపేట: బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా కాజీపేట మండల కేంద్రానికి చెందిన ముదారి రమేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు రమేష్‌కు నియామక పత్రాన్ని జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమౌళి బుధవారం అందజేశారు.

డ్రాయింగ్‌లో కేవీ విద్యార్థుల ప్రతిభ



కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని ఇటీవల నగరంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో కేవీ విద్యార్థులు ప్రతిభ చాటారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన డ్రాయింగ్ పోటీల్లో బిట్ల వర్షిణి ప్రథమ బహుమతి, నందగోపాల్ ద్వితీయ బహుమతి సాధించి కేవీ ప్రిన్సిపాల్ మృదుల చేతుల మీదుగా అందుకున్నారు.

సీఎం కేసీఆర్‌కే ఎరుకల మద్దతు



కాశిబుగ్గ: ఎరుకల సామాజిక వర్గానికి రాజకీయ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కే ఎరుకల కులస్తుల మద్దతు ఉంటుందని ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ అన్నారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి లోకిన రాజు, ప్రభాకర్, లోకిన సమ్మయ్య, రమేష్, ఓని సదానందం, పల్లకొండ హరి, ప్రశాంత్, సురేష్ పాల్గొన్నారు.

మాదిగ విశ్వరూప సభను విజయవంతం చేయాలి

వరంగల్: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఈనెల రెండో వారంలో హైదరాబాద్‌లో జరగనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) జిల్లా ఇన్‌చార్జ్ పల్లె ఉదయ్ పిలుపునిచ్చారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగులు భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబు, కిరణ్, రాజ్‌కుమార్, మధు, స్వామి, యాకోబ్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం

కరీమాబాద్: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టకరమని ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. గ్రేటర్ పరిధిలోని 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట, భగత్‌సింగ్ నగర్, దాసరివాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని రమాదేవి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, శ్రీలత, కళ్యాణి, ఆయాలు శిరీష, కవిత, తదితరులు పాల్గొన్నారు.



ఉర్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి



ర్యాలీ తీస్తున్న ఐసీడీఎస్ అధికారులు, మహిళలు

ఏనుమాములలో తల్లిపాల వారోత్సవాలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పైడిపల్లి సెక్టర్ ఏనుమాముల 5వ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జక్కుల లావణ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలు, తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ కే.లత, ఆయాలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

హన్మకొండ: నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు రూ.24,38,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు బోయినిపల్లి రంజిత్‌రావు, వేముల శ్రీనివాస్, అశోక్, రాములు, బీఆర్ఎస్ నాయకులు నలుబోలు సతీష్, పులి రజనీకాంత్, గుంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన చీఫ్‌విప్

అమరుల యాదిలో వాహన ర్యాలీ



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాటి వనంలో అమరుల యాదిలో భాగంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య బుధవారం ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడన్నల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల్లో కీలక భూమిక పోషించడంతో పాటు అసువులు బాసిన ఉద్యమకారులకు నివాళులు అర్పించారు. సోమిడి గీత పారిశ్రామిక సంస్థ అధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, జిల్లా కార్యదర్శి వీరస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజన్‌బాబు, జనగాని సాయికుమార్, బుర్ర శ్రీనివాస్, శేఖర్, కరుణాకర్, రవికుమార్, రఘువరన్, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ టీ.సురేష్ ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భూ కబ్జాలు, అక్రమాలు, గొడవల్లో తలదూర్చితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వాలే కారణం

వరంగల్ చౌరస్తా: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగానే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు విమర్శించారు. ఆగస్టు 17, 18 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సదస్సు కరపత్రాలను వరంగల్ అబ్బనికుంటలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి గోనె కుమారస్వామి, కోశాధికారి కూసం సంపత్ కుమార్, నాయకులు బల్సుకూరి నర్సయ్య, చెవ్వ వీరమల్లు, గోపాల్, సమ్మయ్య, నాగుర్ల శంకర్‌రావు, రాజేష్, హరి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీఎంఎస్ఏ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎంఎస్ఏ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల తేజ మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలోని సిటీ పరిధిలోని పలు హాస్టళ్లలో వసతులు కరువయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంఎస్ఏ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఠాగూర్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు శివ, నాయకులు మేకల అంకిత్, దామెర రక్షిత్, సన్నీ, మహేష్, అక్రమ్, ప్రణయ్, బన్నీ, పాల్, సాయి, రాహుల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టూడెంట్స్ పాలిటిక్స్ జేఏసీ ఏర్పాటు

కేయూ క్యాంపస్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులతో కలిసి తెలంగాణ స్టూడెంట్స్ పాలిటిక్స్ జేఏసీని ఏర్పాటు చేసినట్లు జేఏసీ తెలంగాణ స్టేట్ చైర్మన్ కే.చంద్రశేఖర్ వెల్లడించారు. ఈమేరకు కేయూ మొదటి గేట్ వద్ద కేయూ జేఏసీ చైర్మన్ తిరుపతియాదవ్‌తో కలిసి జేఏసీ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలతోపాటు యువత ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నేతలతో కలిసి సమస్యలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ స్టూడెంట్స్ పాలిటిక్స్ జేఏసీ ఉపాధ్యక్షుడు వలిగొండ నర్సింహ, జనరల్ సెక్రటరీ బోడ వంశీనాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతియాదవ్, బాధ్యుడు ప్రవీణ్, సామాజికవేత్త డాక్టర్ మహ్మద్ ఆజాం పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ బాధ్యులు

పార్టీని మరింత బలోపేతం చేయండి



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

హసన్‌పర్తి: పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. కార్పొరేటర్ జక్కుల రజిత ఆధ్వర్యంలో భీమారానికి చెందిన ఎండీ.ఆరిఫ్ సర్కార్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. భీమారంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని పేర్కొన్నారు. 56వ కార్పొరేటర్ సిరంగి సునీల్, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రవీందర్, మణీంధర్ నాథ్, నరెడ్ల శ్రీధర్, దేవస్థాన కమిటీ చైర్మన్ చింత లక్ష్మణ్, రైతు బంధు సమితి జిల్లా కమిటీ సభ్యులు విక్టర్ బాబు, పోగుల రమేష్ పాల్గొన్నారు.

బాధితులను పట్టించుకోని ఎమ్మెల్యే

కాశిబుగ్గ: వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు తాము చేయూతనిస్తుంటే వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అహంకారంతో బాధితులను పట్టించుకోకపోగా రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. ఓ సిటీలోని స్వగృహంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌తో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రదీప్‌రావు మాట్లాడారు. వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు బీజేపీ నాయకులు మనోధైర్యం కల్పిస్తూ ఆహారం, నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, మంతెన అమరీష్, మార్టిన్ లూథర్, సుజాత, రేణుక, వెంకటేష్, సైనేష్, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్‌రావు, పక్కన శ్రీధర్

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సుదర్శన్, తదితరులు

ఖిలా వరంగల్: సూక్ష్మ పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ తయారీ, పంపిణీ, వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండల కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, తదితరులతో కలిసి ఫోర్టిఫైడ్ రైస్ వినియోగానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ రైస్‌ను కేంద్ర ప్రభుత్వం చౌక డిపోల ద్వారా పంపిణీ చేస్తోందని వివరించారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ఖిలా వరంగల్: వరద ముంపు బాధితులకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గన్నారపు రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల పేదల కాలనీలు నీటిలో మునిగిపోయాయని, దాంతో వారు సర్వం కోల్పోయి వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జీ.బద్రి, రహేళ, యాకోబ్, రమేష్, షబానా, సుధీర్, దేవరాజ్, దాసు, గణేష్, రాజ్, వీరస్వామి, శారద, రజిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ముంపు ప్రాంతాల్లో సరుకుల పంపిణీ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన మోరంచపల్లి, కొండాయి గ్రామాల వరద బాధితుల సహాయార్థం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో బుధవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించి రూ.5వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

32, 40వ డివిజన్లలో..

కరీమాబాద్ / కాశిబుగ్గ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులకు నిత్యావసర సరుకులను తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం అందజేశారు. అలాగే, 19వ డివిజన్‌లో గాంధీనగర్, 35వ డివిజన్‌లో మైసయ్యనగర్‌లో ఎమ్మెల్యే నరేందర్ సరుకులు పంపిణీ చేశారు.

ఎంపీ పుట్టినరోజు వేడుకలు

హన్మకొండ: తన పుట్టినరోజు వేడుకలను హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలో స్వగృహంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ బుధవారం జరుపుకున్నారు. అనంతరం, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు.



పుట్టినరోజును పురస్కరించుకుని మొక్క నాటుతున్న ఎంపీ పసునూరి దయాకర్

సంక్షిప్తంగా

సమాజాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

కేయూ క్యాంపస్: సోషల్ వర్కర్లు సమాజాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సూచించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం

హసన్‌పర్తి: నేర రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి అన్నారు. హసన్‌పర్తిలో జిల్లా పరిషత్ పాఠశాలలో 'సమాజంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

హన్మకొండ చౌరస్తా: నయీంనగర్‌లోని నాయిని రాజేందర్‌రెడ్డి నివాసంలో ఎన్ఎస్‌యూఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

హసన్‌పర్తి: సమ్మెను విచ్ఛిన్నం చేస్తున్న గ్రామ సర్పంచ్‌లు తమ పదవులకు రాజీనామాలు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ సూచించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపడుతున్న దీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, నాయకులు సంపూర్ణ, అనిత పాల్గొన్నారు.

ఎస్ఎన్ఓలను ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓగా గుర్తించాలి

హన్మకొండ: ఆయుష్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న స్వీపర్ కమ్ నర్సింగ్ ఆర్డర్లీను ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ, మేల్ నర్సింగ్ ఆర్డర్లీగా హోదా మార్చాలని స్వీపర్ కమ్ నర్సింగ్ ఆర్డర్లీ ఉద్యోగులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని కార్యాలయంలో ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవి నాయక్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు.

పెరిగిన ధరలకు సహకరించండి

నయీంనగర్: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, టెంట్ సామాన్ల ధరలకు అనుగుణంగా ధరలు పెంచుతున్నామని, వినియోగదారులు సహకరించాలని కాకతీయ ట్రై సిటీ టెంట్‌హౌస్ అసోసియేషన్ అధ్యక్షుడు నాసని గణేష్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఓరుగంటి పూర్ణచందర్, కోశాధికారి ఎండీ.జహూర్ హైమద్, ఉపాధ్యక్షులు ఎండీ.యాకుబ్‌పాషా, సదువాల వెంకటేశ్వర్లు, సిరుసుపల్లి సుధాకర్ రావు, సహాయ కార్యదర్శి దయాల నాగేశ్వర్, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

కాశిబుగ్గ: ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అన్నారు. డివిజన్‌లోని ముంపు ప్రాంతమైన మైసయ్యనగర్‌లో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోనాచారి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ గణేశ్వర్ రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలకు స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ పడమర కోటలోని గ్రంథాలయ భవనంలో లైన్స్ క్లబ్ ఆఫ్ భీమారం ఆధ్వర్యంలో శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ డాక్టర్ శరత్‌బాబు నేతృత్వంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్పొరేటర్ ఉమ, లైన్స్ ప్రతినిధులు జారతి పద్మ, సత్యనాథ్, సుధాకర్‌రావు, రమేష్, దామోదర్‌యాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వ్యర్థాల తొలగింపు

హన్మకొండ: హనుమకొండ 52వ డివిజన్ పరిధిలో ముంపునకు గురైన కాలనీల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. నీట మునిగిన కిషన్‌పుర, రాజాజీనగర్, క్రాంతినగర్, నందితారే నగర్, రాంనగర్ ప్రాంతాల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈమేరకు పనులను స్థానిక కార్పొరేటర్ చాడా స్వాతి, శ్రీనివాస్ రెడ్డి దంపతులు పర్యవేక్షించారు.

ఉద్యమకారుడికి నివాళి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం రాంగోపాలపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు యాడల హరిప్రసాద్ యాది సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పీటీసీ అసిస్టెంట్ కమాండెంట్ మన్నె భిక్షపతి హాజరై హరిప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయ్, రవీందర్, జయశంకర్, రవి, యాడల జగపతిబాబు, సాంబయ్య, మధు, మేలిషా, భాస్కర్ పాల్గొన్నారు.

గవర్నర్‌కు బీజేపీ నాయకుల వినతి

హసన్‌పర్తి: నాలాల కబ్జా వల్ల కాలనీలు ముంపునకు గురవుతున్నాయని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హరిబాబు అన్నారు. ఈమేరకు జవహర్‌కాలనీలో బుధవారం పర్యటించిన సందర్భంగా గవర్నర్ సౌందర్య రాజన్‌కు వినతిపత్రం అందించారు. కబ్జాలను తొలగించాలని ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, అమృతరావు, మధు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి

కాశిబుగ్గ: మున్నూరుకాపు కులస్తులంతా ఐక్యంగా ఉండాలని మున్నూరుకాపు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ఇట్యాల హరికృష్ణ సూచించారు. 3వ డివిజన్ పైడిపల్లిలో మున్నూరుకాపు సహకార పరపతి సంఘం 19వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు పల్లం భిక్షపతి, శ్రీపతి రమేష్, ఎనబోతుల కిషన్, బొల్లం రమేష్, ఆకుల రంజిత్‌కుమార్, లింగం కోటిలింగం, సాంబమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పల్లాను కలిసిన 108 ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి, జీతాల పెంపు, 4వ స్లాబ్ అమలు చేసేలా సహకరించిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లకావత్ బాలాజీ నాయక్, బోయినపల్లి దేవేందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఏసీపీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

వరంగల్ క్రైం: కాజీపేట డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన డేవిడ్‌రాజ్‌ను టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు శ్యాంసుందర్, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, భరత్, గౌతమ్, ప్రణయ్, సుధాకర్, మల్లేశం పాల్గొన్నారు.

ఎస్సీ 57 ఉపకులాలకు దళితబంధు ఇవ్వాలి

నయీంనగర్: రాజకీయ ప్రాతినిధ్యంలో, దళితబంధు కేటాయింపులో ఎస్సీ 57ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఈక్రమంలో వారికి 40శాతం కోటా కేటాయించాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం చిరంజీవి అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడు టీఎస్.స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్, భిక్షపతి, వేణు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రెనాల్డ్స్ పాఠశాలలో 'హరిత భారత్'

ఖిలా వరంగల్: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని రెనాల్డ్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో హరిత భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఆర్ఐ రాంకీ, కోఆర్డినేటర్ మహేష్, డీన్ వెంకటేష్, సతీష్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి కాంట్రాక్టు లెక్చరర్ల పాదయాత్ర

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కాంట్రాక్టు లెక్చరర్ల పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్ తెలిపారు.

8న బహుజన విద్యార్థి గర్జన

హన్మకొండ చౌరస్తా: ఈనెల 8వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బహుజన విద్యార్థి గర్జన సభ నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ వరంగల్ రీజియన్ సెక్రటరీ కన్నం సునీల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

హన్మకొండ: దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత రౌతు రమేష్ కుమార్ జన్మదిన వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.

వరదలతో ఎల్‌బీ కళాశాలకు నష్టం

రామన్నపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నగరంలోని ఎల్‌బీ కళాశాల అతలాకుతలమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కళాశాల ప్రహరీని మున్సిపల్ అధికారులు కూల్చేయడంతో కళాశాలలోని క్రీడా మైదానం, టేకు వనం, కబడ్డీ కోర్టు, క్యాంటీన్, ఉమెన్స్ హాస్టల్, భద్రకాళి గుడి గేటు నుంచి కళాశాల మెయిన్ రోడ్డు వరకు అంతర్గత తారు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందని వివరించారు. సుమారు 1.50 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



వరదకు కొట్టుకుపోయిన కళాశాలలోని రోడ్డు